సాక్షి
తిరుపతి
గురువారం । 7 । డిసెంబర్ । 2023



ముక్కంటి క్షేత్రం.. భక్తజనసంద్రం

ఏడుగంగల జాతరతో జంగమయ్య క్షేత్రం పులకించిపోయింది. ఏడుగంగల జాతరకు వచ్చిన జనవాహినితో భకజనసంద్రమైంది. - 8లో



ఆదర్శమూర్తి అంబేడ్కర్

గొప్ప విలువలు కలిగిన మహోన్నత వ్యక్తి, పోరాట యోధుడు అంబేడ్కర్ ఆదర్శమూర్తి అని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అన్నారు. - 8లో



యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ

యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేస్తున్నామని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు పేర్కొన్నారు. - 8లో

ఆపద్బాంధవులు

మేమున్నామని మీకేం కాదని.. మీ బాధను తీర్చేస్తామంటూ వరద బాధితులకు ఆపద్బాంధవుల్లా అండగా నిలిచారు వలంటీర్లు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలన్న సదాశయంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నమ్మకాన్ని వమ్ము చేయకుండా నేడు విపత్కర పరిస్థితుల్లోనూ వారు ప్రాణాలు సైతం లెక్కచేయకుండా శ్రమిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నారు. అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. మిచాంగ్ తుపాన్ సమయంలో వలంటీర్ల సేవలపై ప్రత్యేక కథనం.

- తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో అన్నీ తామై ప్రజలకు సేవ
- రక్త సంబంధీకుల్లా ఆపన్న హస్తం
- ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించడంలో ప్రధాన భూమిక
- జిల్లా వ్యాప్తంగా వలంటీర్ల సేవలకు ప్రశంసలు



తిరుపతి అర్బన్: మిచాంగ్ తుపాన్ జిల్లాను అతలాకుతలం చేసింది. ఇప్పుడిప్పుడే జనం కొలుకుంటున్నారు. నాలుగు రోజులుగా ఎడతెరపిలేని భారీ వర్షాల కారణంగా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ప్రభుత్వ యంత్రాంగం అహర్నిశలు కష్టపడుతోంది. ఇందులో సచివాలయ వ్యవస్థ ప్రధాన భూమిక పోషిస్తోంది. ఆపద్బాంధవుల్లా చలామణి అవుతున్న వలంటీర్ల పాత్రపై జిల్లా వ్యాప్తంగా ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. తుపాను ప్రభావిత గ్రామ, వార్డుల్లో వలంటీర్లు తమకు కేటాయించిన 30 నుంచి 50 కుటుంబాలను పెద్ద ఎత్తున అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు స్వయంగా తరలించిన తీరును ప్రజలు ప్రశంసిస్తున్నారు. రక్త సంబంధికులు సైతం పట్టించుకోని పరిస్థితుల్లో మీకు తాము అండగా ఉంటామంటూ భరోసా కల్పించి, అన్ని ఏర్పాట్లు చేశారు. గర్భిణులను క్షేమంగా ప్రసూతి ఆస్పత్రులకు తరలించారు. 31 గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలకు అవ్వతాతలను , రోగులను తరలించి వైద్య సేవలు అందించారు. పంట నష్టాన్ని నివారించేందుకు రైతులకు ముందస్తు సూచనలు ఇచ్చారు. సముద్ర తీర ప్రాంతంలో జాలర్లను వేటకు వెళ్లవద్దని స్పష్టమైన సంకేతాలు ఇచ్చి, తుపాను ప్రభావాన్ని వారికి వివరించారు. పశువులతోపాటు, గొర్రెలు, మేకలను కొండ ప్రాంతాలకు మేతకు తీసుకు వెళ్లే వారికి తుపాన్ హెచ్చరికలు చేయడంతో వారు ఇంటికే పరిమితమై పశు నష్టం కలగకుండా జాగ్రత్త పడ్డారు.

శభాష్ శరత్

పై చిత్రంలో కనిపిస్తున్న వారు వరదయ్యపాళెం మండలం మత్తేరిమిట్ట గ్రామానికి చెందినవారు. మిచాంగ్ తుపాన్‌తో కురిసిన భారీ వర్షాలకు ఆ గ్రామం జలమయమైంది. దీంతో మత్తేరిమిట్ట దళితవాడకు చెందిన కొన్ని ఇళ్లలోకి వరదనీరు వచ్చే పరిస్థితిని ముందస్తుగా గుర్తించిన స్థానిక వలంటీర్ కె.శరత్ వారిని స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల భవనంలోకి తరలించాడు. విషయాన్ని ప్రభుత్వ ఉన్నతాధికారులకు తెలియజేశాడు. స్థానిక సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డికి సమాచారమిచ్చి, ఆయన ద్వారా బాధితులకు రెండు రోజుల పాటు భోజన వసతి, ఇతర సౌకర్యాలను కల్పించారు. ఆపదలో ఉన్న ముంపు బాధితులను ఆదుకుని శభాష్ అనిపించుకున్నాడు.



సేవలో ఆమె ఎప్పుడూ ముందే..

వలంటీర్ రజనీది సూళ్లూరుపేట మండలం, గొల్లలములువు దళితవాడ. తుపాన్ కారణంగా ఆ దళితవాడలో దిండు నాగయ్య, బూదూరు నాగరాజు, కుప్పంపాటి శంకరయ్యలకు చెందిన పూరిళ్లు పడిపోయాయి. కట్టుబట్టలతో చలికి ఇక్కట్లు పడుతున్న వారి సమాచారం తెలుసుకున్న వలంటీర్ రజనీ స్పందించి, బాధితులను పునరావాసా కేంద్రాలకు తరలించారు. వీఆర్వోకు సమాచారం ఇచ్చారు. వారికి నష్టపరిహారం ఇవ్వడమే కాకుండా నూతనంగా ఇల్లు నిర్మించుకోవడానికి తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చి, ఇల్లు మంజూరు చేయించారు. దీంతో వారు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.



ఆయన సేవలు అభినందనీయం

అశోక్ తడ మండలం కాదులూరు వార్డు వలంటీర్‌గా పనిచేస్తున్నారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో పాముల కాలువ పొంగి కాదలూరు గ్రామాన్ని ముంచెత్తింది. వరద బాధితులు ఆదుకునేందుకు వలంటీర్ అశోక్ ఒక అడుగు ముందుకు వేశాడు. ప్రభుత్వం పంపించిన సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇంకా వరద ముప్పులోనే ఉన్న బాధితులకు వీఆర్వోతో కలసి భోజనం తయారు చేయించి, అందరికీ అందజేశారు. విపత్కర సమయాల్లో ఇలాంటి వలంటీర్ల సేవలు అమోఘం అని అశోక్‌ని గ్రామస్తులు అభినందించారు. గత రెండు రోజులుగా ఆహారం తయారు చేసుకోలేని పరిస్థితిలో ఉన్న వరద బాధితులకు ఆహార పొట్లాలు అందించి వారి ఆకలిని తీర్చడంలో వలంటీర్ అశోక్ ఎనలేని సేవలు అందించారు.



నేను సైతం

ఇంటర్ చదువుకుని ఖాళీగా ఉన్న సమయంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థలో పనిచేసేందుకు ఇష్టపడి ముందుకొచ్చాడు గుణశేఖర్. ఆయన నివసమున్న కాలనీలో సేవచేయడానికి వలంటీర్‌గా పనిచేస్తూ ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని సంక్షేమ పథకాలను క్లస్టర్ పరిధిలోని లబ్ధిదారులకు అందజేయగలుగుతున్నానన్న తృప్తి ఉన్నారు. ఇలాంటి సేవ చేసే అవకాశం సీఎం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన చెబుతున్నారు. తుపాన్ ప్రభావంతో క్లస్టర్ పరిధిలోని వారికి ఇబ్బంది కలగడంతో వారిని సకాలంలో ఆదుకుని అధికారుల ద్వారా భోజన వసతి కల్పించడం సంతోషంగా ఉందని చెప్పారు. ఓడూరులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులకు భోజనాలు పెట్టారు.

ఆపదలో సాయం

మిచాంగ్ తుపాను కారణంగా ఒకసారిగా తిరుచానూరు పంచాయతీలోని షికారీ కాలనీలోకి వరద నీరు చొచ్చుకుని వచ్చాయి. రెప్పపాటులో వరద నీరు ఇళ్లలోకి చేరుకోవడంతో షికారీలకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ప్రమాదాన్ని పసిగట్టిన స్థానిక వలంటీర్ హనుమంత నాయక్ బడుగులకు హనుమంతుడిలా సాయం అందించాడు. ప్రమాద తీవ్రతను తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆగమేఘాలపై జేసీబీలను పంపించారు. కాలనీని చుట్టుముట్టిన వరదనీరును మరోమార్గంలో తరలించేందుకు జేసీబీ సాయంతో గండి కొట్టించారు. దీంతో క్రమేపి వరద నీరు తగ్గుముఖం పడుతున్నా, మరో మార్గంలో వరద నీరు వస్తోంది. ఇళ్లలోని నిత్యావసర సరుకులు, బియ్యం నీటిలో తడిసిపోవడంతో వారికి ఆహారం అందించి, ఆపదలో ఆదుకున్నాడు. అలాగే తోటి వలంటీర్లతో కలసి నిరాశ్రయులను పునరావాస కేంద్రాలకు తరలించి అందరి మన్ననలను అందుకున్నాడు.





సేవకు కొత్త నిర్వచనం

తిరుచానూరు షికారీ కాలనీ నీటమునగడంతో దామినేడు గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్న సునీల్ కుమార్ నాయక్ ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్కడకు చేరుకున్నాడు. ముంపు బాధితులకు ప్రాణనష్టం వాట్టిల్లకుండా సేవలు అందించాడు. సుమారు 100కు పైగా కుటుంబాలను కాలనీ పక్కనే ఉన్న కలెక్టరేట్ బంగ్లాలో గ్రౌండ్ ఫ్లోర్‌కు తరలించడం కోసం తీవ్రంగా శ్రమించాడు. సుమారు 270 మందిని నిరాశ్రయులను సురక్షితంగా తరలించడంతో పాటు మూడు రోజుల పాటు సర్పంచ్ రామచంద్రారెడ్డి సహకారంతో భోజన సదుపాయాన్ని కల్పించడంలో సునీల్ కుమార్ నాయక్ తీసుకున్న చర్యలు హర్షణీయం. అలాగే షికారీ కాలనీలో ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ అధికారులతో కలసి ఇంటింటిరీ తిరుగుతూ వారికి ఆరోగ్యసేవలను సైతం అందించాడు. వలంటీర్ సేవకు కొత్త నిర్వచనం తీసుకువరావడంలో సత్ఫలితాలను అందుకున్నాడు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: కేంద్ర, రాష్ట్ర మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న తిరుపతిలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రీషియన్ సంస్థలో సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ రమణప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి అర్హత కలిగి, 25 ఏళ్ల వయస్సులోపు ఉన్న మహిళ, పురుష అభ్యర్థులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 3 ఏళ్ల వయస్సు సడలింపు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 97004 40604, 91005 58006, 97013 43846 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 44,547 మంది స్వామివారిని దర్శించుకోగా 13,125 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.25 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అరణియార్ గేట్లు మూసివేత

పిచ్చాటూరు: వరద నీరు తగ్గుముఖం పట్టడంతో అరణియార్ రేడియల్ స్పిల్ వే గేట్లను అధికారులు బుధవారం మూసి వేశారు. ఉదయం 11 గంటలకు ప్రాజెక్టు గేట్లను జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్ పరిశీలించారు. ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీరు, పూర్తి సామర్థ్యం, అవుట్ ఫ్లో వివరాలను అక్కడే ఉన్న ఇరిగేషన్ ఏఈఈ లోకేశ్వర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 27.5 అడుగులు ఉండడంతోపాటు జలాశయానికి వచ్చే వరద నీరు 3 వేలు క్యూసెక్కులు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టు గేట్లను మూసి వేస్తున్నట్లు ఏఈఈ వెల్లడించారు. వచ్చే వరద నీటితో జలాశయంలో 30 అడుగులు నీరు నిల్వ ఉండేలా చూస్తామని ఇరిగేషన్ ఏఈఈ లోకేశ్వర్ రెడ్డి వెల్లడించారు.

ఆర్టీసీకి రూ.1.50 కోట్ల నష్టం



చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: మూడు రోజులపాటు కురిసిన మిచాంగ్ తుపాన్‌తో ఆర్టీసీకి రూ.1.50 కోట్లు నష్టం వచ్చిందని జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన తమ చాంబర్ విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు, వాకాడు డిపోలకు చెందిన సర్వీసులు ఒకటి రెండు తప్ప మిగిలినవి నడవని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 27 మార్గాల్లో తుపాన్ ప్రభావంతో ఆర్టీసీ సర్వీసులు నడవలేదని చెప్పారు. అయితే గురువారం వర్షం లేకపోవడంతో 12 మార్గాల్లో సర్వీసులను తిరిగి పునరుద్ధరించినట్లు చెప్పారు. మరో 15 మార్గాల్లో శుక్రవారం నుంచి అందుబాటులోకి సర్వీసులను తీసుకొస్తామని తెలిపారు. 3వ తేదీ ఆర్టీసీకి రూ.40 లక్షలు, 4వ తేదీ రూ.50 లక్షలు, 5వ తేదీ రూ.60 లక్షలు నష్టం వచ్చిందన్నారు.

నేడు సాయుధ దళాల పతాక దినోత్సవం

తిరుపతి అర్బన్: సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారి విజయశంకర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ సైనికులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీవారి సేవలో భండారకేరి మఠం పీఠాధిపతి



ధ్వజస్తంభం వద్ద విద్యేశతీర్థ శ్రీపాదుల స్వామీజీ

తిరుమల: తిరుమల శ్రీవారిని ఉడిపిలోని భండారకేరి మఠం పీఠాధిపతి విద్యేశతీర్థ శ్రీపాదుల స్వామీజీ దర్శించుకున్నారు. బుధవారం ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు రిసెప్షన్ డిప్యూటీ ఈఓ హరేంద్రనాథ్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామీజీకి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ముమ్మరంగా సహాయక చర్యలు



సాక్షి, తిరుపతి: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టినట్లు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి వెల్లడించారు. వరద ప్రభావం, సహాయక చర్యలపై సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు.

సాక్షి: తుపాను ప్రభావంతో ప్రస్తుతం జిల్లాలో పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఎంత నష్టం వాటిల్లింది?

కలెక్టర్: నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు జిల్లాలో 14 మండలాల్లో పంటలు, ఇళ్లు దెబ్బతిన్నాయి. 50 నుంచి 60 సెం.మీ వర్షపాతం నమోదైంది. రికార్డుస్థాయిలో కాళంగి నుంచి 44 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వచ్చాయి. ఇంకా తిరుమల, జిల్లాలోని రిజర్వాయర్లన్నీ పూర్తిగా నిండిపోవడంతో నీటిని దిగువకు విడుదల చేయాల్సి వచ్చింది. ఇంకా వాగులు, వంకల నుంచి వచ్చే వరద నీటికి జాతీయ రహదారిపైనే 5, 6 అడుగుల లోతు నీరు ప్రవహించింది. ఫలితంగా రహదారులు, ఇరిగేషన్ పరిధిలో సుమారు రూ.450 కోట్లు నష్టం వాటిల్లింది. 30 నుంచి 40 రోజుల వయస్సు ఉన్న వరి పైరు మునిగింది. అందులో 7,500 హెక్టార్లలో పంట దెబ్బతింది. 245 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 49 పశువులు మరణించాయి. 10 లక్షల చేప పిల్లలు వరదలకు కొట్టుకుపోయాయి. గూడూరు డివిజన్‌లో ఇప్పటికీ కొన్ని గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి.

సాక్షి: బాధితులకు పరిహారం.. సహాయక చర్యలు ఎలా ఉన్నాయి?

కలెక్టర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం మొత్తం వరద సహాయక చర్యల్లో నిమగ్నమైంది. తక్షణ అవసరాల కోసం ప్రభుత్వం రూ.2 కోట్లు విడుదల చేసింది. నిర్వాసితుల కోసం 80 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశాం. అందులో ఉన్న వారందరికీ ఆహారం, నీరు, వసతి ఏర్పాట్లలో ఎక్కడా వెనకడుగు వేయలేదు. వరద ప్రాంతాల్లో 84 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశాం. జిల్లా వ్యాప్తంగా 25 వేల కుటుంబాలకు రూ.వెయ్యి నుంచి రూ.2,500 నగదుతో పాటు ఐదు రకాల వస్తువులు పంపిణీ చేస్తున్నాం.

సాక్షి: విద్యుత్ పునరుద్ధరణ, రహదారుల మరమ్మతు పనులు ఎంత వరకు వచ్చాయి?

కలెక్టర్: తుపాను ప్రభావం కారణంగా 490 గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. రెండు రోజులుగా సీఎండీ, జేసీ ఇద్దరు విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో బిజీగా ఉన్నారు. 4, 5 సబ్ స్టేషన్లు మినహా మిగిలినవన్నీ పూర్తి కావచ్చాయి. అవి కూడా స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహించడంతో ఆలస్యం అవుతోంది. అవి కూడా ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేస్తాం. ఇకపోతే దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

సాక్షి: వలంటీర్ల సేవలు ఎలా ఉన్నాయి?

కలెక్టర్: వలంటీర్లు అద్భుతంగా సేవలు అందిస్తున్నారు. స్థానికులకు అవగాహన కల్పించి పునరావాస కేంద్రాలకు తరలించారు. ముఖ్యంగా 162 మంది గర్భిణులను గుర్తించి సమయానికి ఆస్పత్రుల్లో చేర్చడం అభినందనీయం. వరదల్లో కొట్టుకుపోకుండా స్థానికులను కాపాడే విషయంలోనూ వలంటీర్లు ముందున్నారు. ప్రజల ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారయంత్రాంగం అందుబాటులో ఉంటుంది.

80 శాతం రాయితీతో వరి విత్తనాలు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : వర్షాభావం కారణంగా వరినాట్లు దెబ్బతిని ఉంటే రైతులకు 80 శాతం రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని పూడి, పెన్నలపాడు, కొన్నలి తదితర గ్రామాల్లో బుధవారం ఆయన నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల నుంచి విత్తనాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ భూముల్లో నీరు తగ్గగానే వ్యవసాయాధికారులు, సిబ్బంది సర్వే నిర్వహించి పంట నష్టాన్ని అంచనా వేసి, నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏడీఏ(పీపీ) ధనుంజయరెడ్డి, శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్ రెడ్డి, వ్యవసాయాధికారులు సురేంద్ర, సుధాకర్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



వ్యవసాయాధికారులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్ రావు

వచ్చే ఏడాది ఆర్జిత సెలవులివీ

తిరుపతి రూరల్: దుకాణాలు, కర్మాగారాలు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనంతో కూడిన(ఆర్జిత) సెలవుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఆ మేరకు కార్మిక శాఖ కర్నూలు జోన్ జాయింట్ కమిషనర్ బాలునాయక్ గురువారం తిరుపతిలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఏపీ షాప్స్, ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు–1988 ప్రకారం 2024 సంవత్సరంలో జాతీయ పండుగలు, సెలవు దినాలకు సంబంధించి ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందన్నారు. జనవరి 16న కనుమ, 26న రిపబ్లిక్ డే, ఏప్రిల్ 11న రంజాన్, మే 1న మే డే, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం, అక్టోబర్ 2న గాంధీ జయంతి, 12న విజయదశమి, నవంబర్ 1న రాష్ట్ర అవతరణ దినోత్సవం, డిసెంబర్ 25న క్రిస్మస్ సందర్భంగా వేతనంతో కూడిన సెలవును కార్మికులు హక్కుగా పొందవచ్చని ఆయన తెలిపారు.

ఆగమోక్తంగా ఆకాశదీపం



కార్తీక దీపానికి పూజలు చేస్తున్న అర్చకులు,భక్తులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఆకాదీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతిరోజు ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తుంటారు. ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ

తిరుపతిరూరల్: యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేస్తు న్నామని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు పేర్కొన్నారు. ఆయన రెండు రో జులుగా ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అధికారులు, సిబ్బంది నిర్విరామంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. వరదలు కొనసాగుతున్న ప్రాంతాల్లో కూడా స్థానిక అధికారులు, సిబ్బందితో పాటు కర్నూలు, అనంతపురం, కడప సర్కిళ్ల నుంచి విచ్చేసిన అధికారులు, సిబ్బంది రేయింబవళ్లు పని చేస్తున్నారని తెలిపారు. వరద ఉధృతి ఎక్కువగా వున్న ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులకు ఆటంకం ఏర్పడుతోందన్నారు.

గృహ, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గృహ, తాగునీటి సరఫరా కోసం అవసరమైన విద్యుత్ సర్వీసులను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామని సీఎండీ సంతోషరావు తెలిపారు. శాశ్వత ప్రాతిపాదికన విద్యుత్ లైన్ల మరమ్మతు పనులను చేపట్టేందుకు అవకాశం లేని ప్రాంతాల్లో కేబుళ్లను ఏర్పాటు చేసి, తాత్కాలికంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆది, సోమవారాల్లో 11.53 లక్షల విద్యుత్ సర్వీసులు, 1.65 లక్షల వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. బుధవారం సాయంత్రానికి 11.27 లక్షల విద్యుత్ సర్వీ సులు, 42 వేల వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సరఫరాను పునరుద్ధరించామన్నారు. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని 7 పట్టణాలు, 1132 గ్రామాలకు బుధవారం సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని తెలిపారు. మిగిలినవి కూడా గురువారం ఉదయానికల్లా పునరుద్ధరిస్తామన్నారు. వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్లు 1912 లేదా 1800 425 155333 కాల్ చేయవచ్చని, అలాగే సంస్థ వాట్సాప్ నంబర్ 91333 31912కు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

వరద బాధితులకు ప్రభుత్వం అండ

గూడూరురూరల్: తుపాన్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని తిరుపతి జిల్లా ప్రత్యేకాధికారి శ్యామలరావు అన్నారు. బుధవారం రాత్రి గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ ఎం కిరణ్ కుమార్‌తో తుపాన్ సహాయక చర్యలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సహాయక సేవలు అందించాలన్నారు.

ముక్కంటి క్షేత్రం.. భక్తజనసంద్రం


- ఘనంగా ఏడుగంగల జాతర
- సమస్తలోకాలను పాలించే చల్లనితల్లి
- భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లి

శ్రీకాళహస్తి: ఏడుగంగల జాతరతో జంగమయ్య క్షేత్రం పులకించిపోయింది. సప్తగంగల వైభవాన్ని చాటుతూ జరిగ ఏడుగంగల జాతర ప్రాభవాన్ని చూసి తరించేందుకు అశేష జనవాహినితో భకజనసంద్రమైంది. శ్రీకాళహస్తిలో ఏడుగంగమ్మల జాతర వైభవంగా జరిగింది. ఏడుగంగమ్మల గుడి వద్ద నుంచి ఏడుగురు గంగమ్మలను ఆయా జాతర కమిటీలు మంగళవారం అర్ధరాత్రి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పురవీధుల్లో ఊరేగించారు. ఏడుగంగమ్మల ఊరేగింపు వైభవాన్ని చూసేందుకు భక్తులు అశేషంగా తరలివచ్చారు. భక్తులు గంగమ్మలను దర్శించుకుని, హారతులిచ్చారు. పిండిదీపాలు, కొబ్బరికాయలతో నైవేద్యం సమర్పించారు. ఊరేగింపులో దేవతా కళారూపాలు ఆకట్టుకున్నాయి. ముతాలమ్మగుడి వద్ద ప్రత్యేక హారతులు సమర్పించిన తరువాత పెండ్లిమండపం వరకు చేరుకుని మొదటి గంగమ్మను స్థాపించారు. సప్త గుర్రాలు కలిగిన సూర్యప్రభ వాహనంపై అష్ట భుజాలతో ఆయుధాలు ధరించి బంగారు రంగు వస్త్రాలతో భక్తులకు మొదటి గంగమ్మ పొన్నాలమ్మ రూపంలో నిలువెత్తు రూపంతో కనువిందు చేసింది. అనంతరం గాంధీ వీధి గంగమ్మ కోనేరు పక్కన కుమారస్వామి ఆలయ సమీపంలో కొలువుదీరింది. ఈమె అంకమ్మ విశ్వరూప ప్రశాంతమై రథంపై 8 చేతుల్లో ఆయుధాలతో బంగారుచీర ధరించి తలపై కొప్పుతో భక్తులకు దర్శనమిచ్చింది. భేరివారి మండపం వద్ద పూల హంస పడవ గోపురం ఆకృతిలో నిర్మించిన రథం అందరిని ఆకట్టుకుంది. దీనిపై ముత్యాలమ్మ అమ్మవారు శూలం ధరించి పసుపు వర్ణంతో ఎర్రని చీర ధరించి ఆకట్టుకునేలా ఏర్పాటు చేశారు. ఉత్తరాజి శరవణ బృందం ఏర్పాట్లను చేశారు. జయరామరావువీధిలో కావమ్మ పూలచంద్ర ఆకృతి రథంపై ఐదు తలల శేషుడి నీడలో వాసుకిపై నాట్యం చేస్తున్నట్లుగా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సన్నిధివీధిలో వెండి కవచాలతో, వెండి సింహవాహనంపై వెండి ఛత్రం కింద ఐదు తలల శేషుడిని కిరీటంగా ధరించి అద్భుతమైన పూలకిరీటంతో నాలుగు భుజాలతో అంకాలమ్మ ఆశీనురాలై భక్తులకు దర్శనమిచ్చింది. బ్రాహ్మణవీధిలో నల్లగంగమ్మ కలశం, కమలం, చంద్రుడు కిరీటంలాగా ఉన్న ఐదు గుర్రాలు కలిగిన రథంపై 46 చేతులతో నల్లగంగమ్మ భక్తులకు కనువిందు చేసింది. కొత్తపేట భువనేశ్వరి అమ్మవారు 8 చేతులలో ఆయుధాలు ధరించి, రెండు అశ్వాల రథంపై నిలబడి భక్తులకు దర్శనమిచ్చింది అనంతరం రాత్రి 7 గంటలకు అమ్మవార్లకు ఏడుగంగమ్మల ఆలయం వద్ద నిమజ్జనం చేశారు.






కొత్తపేటలో కొలువుతీరిన భువనేశ్వరి , గాంధీవీధిలో కొలువుతీరిన అంకమ్మ, తేరువీధిలో కొలువుదీరిన నల్లగంగమ్మ, సన్నిధివీధిలో కొలువుతీరిన అంకాళమ్మ





జయరామరావువీధిలో కొలువుదీరిన కావమ్మ, భేరివారి మండపం వద్ద కొలువుదీరిన ముత్యాలమ్మ, పెండ్లిమండపం వద్ద కొలువు తీరిన పొన్నాలమ్మ

ఆదర్శమూర్తి అంబేడ్కర్

– టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: గొప్ప విలువగలు కలిగిన మహోన్నత వ్యక్తి, పోరాట యోధుడు, విజ్ఞాని డాక్టర్ బీఆర్. అంబేద్కర్ ప్రపంచానికే ఆదర్శమూర్తి అని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి టీటీడీ చైర్మన్ పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అణగారిన ప్రజల వాస్తవ స్థితిగతులను గుర్తించి, వాటి పరిష్కారంలో ప్రపంచానికే ఓ దిక్సూచిగా నిలిచిన మహాపురుషుడు అంబేద్కర్‌ను స్మరించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు.

తరతరాలుగా దోపిడీకి గురవుతున్న పేద, దళిత, బడుగు, బలహీనవర్గాల వారికి అండగా, దండగా నిలిచిన అంబేడ్కర్ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా మిగిలిపోయారన్నారు. పీడిత ప్రజల కోసం పోరాడేవారికి అంబేద్కర్ ఓ కరదీపిక అని పేర్కొన్నారు. వాళ్లు వీళ్లు అని తేడా లేకుండా ప్రతి ఒక్కరూ అంబేద్కర్ నామ జపం చేయాల్సినంతగా ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కోటూరు ఆంజనేయులు, బి.అనిల నల్లానిబాబు, తలారి రాజేంద్ర, ఆర్. అజయ్‌కుమార్, అంబేద్కర్ కృష్ణ, దేవానందం, కుమార్, మధుబాల, తాళ్లూరు ప్రసాద్, శాంతా రెడ్డి, గీతా యాదవ్, బీసీ వెల్ఫేర్ అధికారి చెన్నయ్య, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు

అసమానతల నిర్మూలనకు విద్యే మూలం



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి

–డిప్యూటీ సీఎం నారాయణస్వామి

తిరుపతి అర్బన్: కుల అసమానతలు పూర్తిగా నిర్మూలించడానికి విద్య ఎంతో దోహదపడుతుందని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ దేవుడి దృష్టిలో అంతా సమానమన్నారు. అయితే నాడు కులవివక్షను గుర్తించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసమానతలను రూపుమాపడానికి విద్యే వజ్రాయుధంగా భావించారని చెప్పారు. ఈ క్రమంలో విద్యకు ఆయన ఎంతో ప్రాముఖ్యతను ఇచ్చారన్నారు. అదేబాటలో ఈ రోజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతను అందరు గుర్తిస్తున్నారని చెప్పారు. మీరు చదవండి.. మేము చదివిస్తామంటూ జగనన్న చెప్పే మాటలను గుర్తు చేశారు. అనంతరం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా మిగిలిపోయాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచల కిషోర్, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలిచాం

- ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాం
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించిన కలెక్టర్



సీఎం సమీక్షకు హాజరైన జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో బాధితులకు అండగా నిలిచామని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లి నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తుపాన్ ప్రభావం ఎక్కువగా నెలకొన్న 8 జిల్లాల కలెక్టర్లు, స్పెషల్ ఆఫీసర్లు, ఎస్పీలతో మాట్లాడారు. తిరుపతి జిల్లా నుంచి కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డితోపాటు, తుపాన్ ప్రత్యేకాధికారి సీనియర్ ఐఏఎస్ అధికారి శ్యామలరావు, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. కలెక్టర్, జిల్లా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు తెలియజేయడంతోపాటు పర్యవేక్షణ చేశామన్నారు. జిల్లాలో 29 మండలాల్లోని 546 గ్రామాలపై తుపాన్ ప్రభావం పడిందని, 84 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 6,478 మందికి ఆశ్రయం కల్పించి వారికి టిఫిన్, భోజన ఏర్పాట్లు చేశామని చెప్పారు. పునరావాసా కేంద్రాల నుంచి వారు ఇంటికి వెళ్లే సమయంలో ఒక్కరికి రూ.వెయ్యి చొప్పున ఇచ్చామని చెప్పారు. కుటుంబం మొత్తానికి అయితే రూ.2500 అందించామని తెలిపారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లోని 22,635 మంది కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా గాలుల నేపథ్యంలో 496 గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలిగిందని చెప్పారు. ఇప్పటివరకు 291 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ చేపట్టామని చెప్పారు. బుధవారం సాయంత్రానికి 5, 6 గ్రామాల మినహా మిగిలిన గ్రామాల్లో పూర్తిగా పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. ఆ గ్రామాలు కోట వాకాడు రహదారిలో మార్గంలో ఉన్నాయని, వాటికి రవాణా మార్గం ఇబ్బంది కారణంగా ఆలస్యం అవుతుందని తెలిపారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా బోర్ల వద్ద జనరేటర్లు, టాంకర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. రహదారులకు సంబంధించి ఆర్అండ్‌బీ 97 కిలోమీటర్లు, పంచాయితీ రాజ్ 87 కి.మీ. దెబ్బతిన్నాయని ప్రస్తుతానికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టామని చెప్పారు. ఇరిగేషన్‌కు సంబంధించి 244 కాలువలు దెబ్బతిన్నాయని తెలిపారు. విత్తు వేసి నెలరోజులు మాత్రమే అయిన వరి పంట 7,126 హెక్టార్లు, మిరప, పూలతోటలు తదితర ఉద్యాన పంటలు సుమారు 246 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. పిచ్చాటూరు వద్ద ఆక్వా ఫామ్ దెబ్బతిందని, పలు పశువులు, దూడలు, గొర్రెలు, మేకలు మృతి చెందినట్లు చెప్పారు. డీఆర్వో పెంచల కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీగల్ సెల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గాలింపు చర్యలు

తిరుపతి మంగళం : వాగులో గల్లంతైన బాలుడి ఆచూకీ కోసం పోలీసు బృందాల గాలింపు చర్యలు బుధవారం కూడా కొనసాగాయి. తిరుపతి అర్బన్ మండలం మంగళం సమీపంలోని పీఎస్ఎన్ గార్డెన్స్ వద్ద నిఖిల్ (10) వాగులో మంగళవారం గల్లంతైన విషయం విదితమే. అయితే బాలుడి ఆచూకీ కోసం మంగళవారం రాత్రి వరకు స్థానిక ఎస్ఐ జగన్నాథరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బృందాలు గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం నుంచి పోలీసు బృందాలు, అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ ఆధ్వర్యంలో జేసీబీల సాయంతో ముళ్ల కంపులను సైతం తొలగించి బాలుడి ఆచూకీ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. బుధవారం చీకటి పడే సమయానికి కూడా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో బాలుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. తహసీల్దార్ తో పాటు వీఆర్వోలు సుమన్, భూపతి ఉన్నారు.



గల్లంతైన బాలుడి కోసం గాలిస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు



తిరుపతి నగరంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో ఆర్డీవో నిషాంత్‌రెడ్డి నుంచి నగదు అందుకుంటున్న జానకి , మునిసుమలత, మంజుల మునిలక్ష్మి



సూళ్లూరుపేట పునరావాస కేంద్రంలో వరద బాధితులకు సరుకులు అందజేస్తున్న ఆర్డీవో చంద్రముని

మేమున్నామనీ..

వరద బాధితులకు సహాయక చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి. పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు అధికారులు ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం అందజేస్తున్నారు. వరద ఉధృతిలో చిక్కుకున్న వారిని అధికారులు, రెస్క్యూటీం సభ్యులు రక్షిస్తున్నారు. పంటలు దెబ్బ తిన్న ప్రాంతాలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. బుధవారం తాడేపల్లి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లు, స్పెషల్ ఆఫీసర్లు, ఎస్పీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా పరిస్థితులను వివరించారు. మరోవైపు పలువురు ప్రజాప్రతినిధులు బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు.

– తిరుపతి అర్బన్



కోట మండలం దైవాలదిబ్బ వద్ద రొయ్యలగుంతల వద్ద చిక్కుకున్న వారిని రక్షించి తీసుకు వస్తున్న ఆర్డీవో కిరణ్‌కుమార్, రెస్క్యూటీం



ఏర్పేడు మండలం పల్లం ఎస్టీ కాలనీలో నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం



తిరుపతి రూరల్ మండలం సాయినగర్‌లో నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న మోహిత్‌రెడ్డి



గూడూరు వరదానగర్ గిరిజన కాలనీలో ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



ఏర్పేడు మండలం ఇసుకతాగేలిలో దెబ్బతిన్న బొప్పాయి పంటను పరిశీలిస్తున్న దశరథరామిరెడ్డి